
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# గర్జించే నలభైలు

"పెట్టుకున్నన్నంత కాలం నెత్తిమీదే పెట్టుకున్నారుగా! అయినా ఇప్పుడేమైంది? భూమి గుండ్రంగా ఉంటుందంట, అమెరికా సరిగ్గా మనమున్న చోటుకి అవతలవైపుందంట. అంటే ఇప్పుడు మన నెత్తి మీదుగా వాడూ, వాడి నెత్తిమీదుగా మనం ఉన్నామన్నమాట. ఏం చేస్తాం?"

తన ఐపాడ్ లో చూస్తున్న సినిమా ' సీతారామయ్యగారి మనవరాలు ' లోని సన్నివేశాన్ని మళ్ళీ మళ్ళీ రీవైండ్ చేసుకుంటూ చూస్తున్నాడు ఆనంద్. చూస్తున్న కొద్దీ అతని మనసులో సుళ్ళు తిరుగుతున్న బాధ. తెలియకుండానే ఉబికివస్తున్న కన్నీళ్ళు.

" పెట్టుకున్నంతకాలమూ నెత్తిమీదేగా పెట్టుకున్నారు!!" అవును.. నిజమే, కానీ తనకి ఆ సంగతి ఇప్పుడే ఎందుకు గుర్తొస్తోంది?

మేఘాలూ, మెరుపులూ లేని నిర్మలాకాశంలో ఇండియావైపుకు సాఫీగా వెళుతోంది విమానం. కానీ ఆనంద్ మనసులో ఆలోచనా మేఘాలూ, కొత్తగా తెలుస్తున్న సత్యాల మెరుపులూ అలముకుని ఉన్నాయి.

“రెండేళ్ళ పిల్లాడిని నీకొదిలేసి కానుపులో పోయిందా పిచ్చి తల్లి! ఎన్నాళ్ళిలా ఒక్కడివే తిప్పలు పడతావ్? చెయ్యి కాల్చుకుంటూ, ఉచ్చలూ, ఉమ్ములూ కడుక్కుంటూ? నా మాటిని మళ్ళీ పెళ్ళి చేసుకో, చుక్కలాంటి పిల్లుంది నా ఎరికలో” అని ఎవరైనా హితవు చెప్పబోతే వాళ్ళ ని కొట్టినంత పని చేసి, తనని గుండెల్లో పొదువుకుని, జో కొట్టి నిద్ర పుచ్చి నెత్తి మీద పెట్టుకున్న సంగతి..

బాగా చిన్నప్పుడు తనని భుజాల మీద కూర్చోబెట్టుకుని తోటలవెంటా, గట్లవెంటా తిప్పుతున్నప్పుడు తను చేతులతో తల మీద తప్పట్లు చరుస్తూ ఉంటే 'నా చిన్నారివీ చేతులూ అంటూ మురిసిపోతూ తనని నెత్తిమీద పెట్టుకున్న సంగతి...

సైకిల్ తొక్కడం నేర్పవా? అంటూ అడిగితే 'పదరా నాన్నా' అంటూ ఒక భుజాన సైకిల్ నీ, మరొక భుజాన తననీ ఎత్తుకుని ఒక్క పరుగున గ్రవుండు చేర్చి 'ముందు ఇలా రెండు పెడల్స్ మీదా కాళ్ళు పెట్టి ఆపైన నెమ్మదిగా ముందుకు తొక్కాలి అంటూ తన భుజాన్ని ఊత ఇచ్చి, తను పడిపోకుండా కాపుకాసి నెత్తిమీద పెట్టుకున్న సంగతీ..

"లేక లేక అపురూపంగా ఇంక పిల్లలు పుట్టరనుకుంటున్న టైములో పుట్టాడు, వీడినొదిలి నేనొక్క క్షణం ఉండలేను. వాడికి స్కూలైనా, కాలేజీ అయినా ఊరిలోనే, నా కళ్ళముందే. అంతే కాని వాడినొదిలి నేనుండేది కల్ల, అంతగా వాడు చదువు కో, ఉద్యోగానికో వెళ్ళవలసిన పరిస్థితే వస్తే, అప్పుడు కావలిసొస్తే భూములన్నీ అమ్మేసుకుని పట్నంలో వ్యాపారం పెట్టుకుంటాను కానీ వాడు లేని ఇంట్లో నేనుండేది అసంభవం “అంటూ కన్నీళ్ళతో తనని అల్లుకుపోయిన సంగతీ..

తనకి కడుపు నొప్పి వస్తే కషాయం కాచి ఇస్తూ, “ఏం తిన్నావనిరా కన్నయ్యా కడుపునొప్పి? మూడంటే మూడట్లు, దీనికే ఎవరి కన్ను పడిందో? పొద్దున్నించి లేవలేదు పిల్లాడు" అంటూ అచ్చు తానే అమ్మై దిష్టి తీసిన సంగతీ.

రెండు మార్కులు ఎక్కువొస్తే ఊరందరికీ పటికబెల్లం పంచి, నాలుగు తక్కువొచ్చినప్పుడు మాత్రం ' పర్వాలేదురా, నీ కోటాలో వచ్చేసారి ఎక్కువ మార్కులున్నాయని దానర్థం. బెంగపడకుండా చదివితే ఫస్టు క్లాసులో పాస్ అవ్వవూ" అంటూ ధైర్యం చెప్పి నెత్తినపెట్టుకున్న సంగతీ..

స్కూల్లో చెప్పేది చరిత్రా, భూగోళ శాస్త్రాలే అయినా ఇంట్లో తనకి అన్ని పాఠాలూ చెప్పి, చేతివ్రాత అందంగా ఉంటే తల రాత అందంగా ఉంటుందిట. నా చేతి రాత చూడు కొక్కిరి పిక్కిరి, అందుకే మీ అమ్మ మనల్ని వదిలేసి వెళ్ళిపోయింది. నువ్వు చక్కగా రాసి, చేతిరాతనీ, జీవితాన్నీ అందంగా తీర్చిదిద్దుకోవాలి అని చెపూ వేడి అన్నం మీద కాచిన నెయ్యి, కమ్మనీ పప్పూ వేసి, " నీ చెయ్యి కలుతుంది, నే కలిపి పెడతా" అంటూ ముద్దలు తినిపించి కడుపు నింపుతూ, చిన్న చిన్న జీవిత సత్యాలు చెపూ తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేటపుడూ ఆ కళ్ళల్లోనూ, మనసులోనూ తనే నిండి పోయి ఉన్నాననన్న విషయమూ..

ఇంటర్మీడియెట్ పూర్తి అయ్యాకా ఇంజనీరింగ్ చదువుతానంటే " అయ్యో! మంచి కాలేజీలో సీట్ వచ్చిందిరా!, కానీ నిన్నొదిలి నేనుండగలనా?" అన్న మనసుని సమాధానపరిచి, బాధని కళ్ళల్లోనే ఆపి ..

" అప్పుడూరికే అన్నానులేరా, చదువు లేకపోతే జ్ఞానమేదీ, సంస్కారమేదీ? నువ్వు బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగస్థుడవై సుఖంగా ఉంటే నా కంత కంటే సంతోషం ఉందా? నేనేనాడు భూగోళ పాఠాలు చెప్పడం మొదలుపెట్టానో గానీ, నా ప్రపంచమంతా ఈ ఊరూ,ఈ చిన్న భూమే అయిపోయింది. నువ్వు మాత్రం ప్రపంచాన్ని చూడాలి, కేవలం ఈ ప్లాస్టిక్ గ్లోబు ని కాదు. నీ కన్నా నాకెవరున్నారు కన్నయ్యా, నువ్వెంత కావాలంటే అంత చదువుకో "అని తన చదువే ప్రధానంగా, తన సంతోషమే ప్రధానంగా భావిస్తూ నెత్తిన పెట్టుకున్న సంగతీ..

'రాజారాం ( మధురాంతకం రాజారం గారు) పంతులుగారిలా అన్నారా నాన్నా! " ఉద్యోగికి దూరభూమి లేదూ అని. లక్షణమైన చదువు చదివావు, చక్కటి ఉద్యోగం ఎక్కడుంటే అక్కడికి నువ్వే వెళ్ళాలి, అయితే ఒక్క విషయం పంతులుగారే మరో కథలో అంటారు ' అరచేతిలోకి గ్లోబ్ వస్తే చాలా? జీవితంలోకి ఆనందం రావద్దూ?" అని. ఎంత గొప్ప మాటో చూడు!! జీవితంలో ఆనందాన్ని మాత్రం ఎప్పుడూ దూరం కానీయకు. ఎందుకంటే నీకు నేను ఎంతో మనసు పడి పెట్టుకున్న పేరు ఆనంద్. నీ జీవితంలో ఆనందం కరువైతే నా ఆశకీ, ఆ పేరుకీ అన్యాయం జరిగినట్టే " అంటూ గుండెల్లో కొండంత దిగులునీ, వయసు తెచ్చిన శరీరపు ముడతల్లో తన జ్ఞాపకాలని భద్రంగా దాచుకుని పైకి నవ్వుతూ విమానం ఎక్కించినప్పుడు కూడా తన ఆశలనీ, కోరికలనీ మాత్రమే నెత్తినపెట్టుకున్న సంగతీ..

' ఇవి గర్జించే నలభైలు రా కన్నయ్యా, పశ్చిమం వైపునించి తూర్పు వైపుకి బాగా శక్తివంతంగా వీస్తాయి అంటూ వాటిగురించి వివరంగా చెప్తూ..

వీటికీ జీవితానికీ బాగా దగ్గర పోలిక ఉందనిపిస్తింది రా నాన్నా నాకు. ఎలాగో తెలుసా? మన జీవితాల్లో రక రకాల వ్యాపకాలతో మొదటి ఇరవై ముప్పై ఏళ్ళు గడిచిపోతాయి. అంటే అసలైన జీవితం నలభైల్లోనే అన్నమాట. నీకు కూడా గర్జించే నలభైలుండాలికా నాన్నా! అర్థం కాలేదు కదూ?

నువ్వు చక్కగా స్థిరపడి, ఇల్లూ, వాకిలీ అమర్చుకుని, చక్కని భార్యతోనూ, ముచ్చటైన పిల్లలతోనూ ఉంటే దానికన్నా గర్జించే నలభైలుంటాయా? లైఫ్ బిగిన్స్ ఎట్ ఫార్టీ అంటున్నారు కదా ఈ మధ్యన? అవును మరి, ఇరవైలన్నీ చదువుల్లోనూ, ఉద్యోగాన్వేషణలోనూ గడిచిపోతే, ముప్పైలు పెళ్ళీ, పిల్లాలూ అంటాయి. జీవితంలో బాధ్యతలెన్నో, దేనికేం చెయ్యాలో తెలుసుకుని దానికి తగ్గట్టుగా జీవితాన్ని మలుచుకుంటే అప్పుడు నలభైలు గర్జించవూ?

అన్నట్టు నువ్వు నాకు ఇంచుమించుగా నలభైవ ఏటే పుట్టావు. నేనప్పుడు ఎంత ఆనందంతో గర్జించానో, రేపు గొప్పవాడివైతే అప్పుడింకా ఆనందంతో గర్జిస్తాను. 'పుత్రోత్సాహం తండ్రికి" పద్యం తెలుసు కదా, అలాగన్నమాట?"

ఆ గర్జించే నలభైలు నౌకాయానం సజావుగా సాగడానికి సహకరిస్తాయి, మనం సరిగా ప్లాన్ చేసుకుంటే మన గర్జించే నలభై లు కూడా మన జీవిత నౌక హాయిగా సాగడానికి ఉపయోగిస్తాయి" అంటూ ఎంతో సున్నితంగా సామ్యం చెప్తూ తన చేత సరి అయిన వయసులో, సరి అయిన ప్రణాళికలు చేసుకునేలా తయారుచేసి అప్పుడు కూడా తన ఆనందాన్ని, భవిష్యత్తునే నెత్తి మీద పెట్టుకున్న సంగతీ..

" జనని అని నా క్లాస్ మేట్ నాన్నా, నేను" అని చెప్పడానికి ఇంకా సందేహిస్తూ ఉండగానే

' నీ మనసులోని మాట నాకు తెలిసిందిరా, పిల్ల పేరు చూడు ఎంత బావుందో? జనని అనే మాటకి అర్థం తెలుసు కదా, 'అమ్మ' అని. మీ అమ్మే ఇలా వచ్చిందేమో నీకోసం. నీ మనసు గెల్చుకున్న పిల్ల నీ ఇల్లు చక్కదిద్దగలదన్న నమ్మకం నాకుంది. వాళ్ళింట్లో మాట్లాడేది తమిళమా, పంజాబీయా అనేది నాకనవసరం. నా కొడుకుకి నచ్చింది అన్నదే ముఖ్యం" అంటూ ఇద్దరికీ రంగ రంగ వైభవంగా పెళ్ళి చేసినపుడు కూడా తన మాటనీ, మనసునీ తన నెత్తిన పెట్టుకున్న సంగతీ..

" ఈ టాబ్ నీదగ్గరుంచుకో నాన్నా, నీ మనవడినీ,నన్నూ,కోడలినీ తరచూ చూడచ్చు "అంటే,

" మనుషులు సృష్టించినవిరా ఇవి, మన మనసులకన్నా, మెదళ్ళకన్నా శక్తివంతమైనవి కావు. నీ చిన్నప్పటి విషయాలన్నీ నా మనోఫలకంలో ఎప్పుడూ సినిమా తిరిగినట్టు కనిపిస్తూనే ఉంటాయి. ఇప్పుడు ఈ చిన్నారి కన్నయ్యవీ అంతే. దానికి నాకేమీ కొత్త రాము (RAM) అక్కర్లేదురోయ్!" అంటూ చిరునవ్వు నవ్వినపుడు కూడా తన జ్ఞాపకాలే ముఖ్యమన్న విషయం..

"అవి, అవన్నీ ఈ రోజే జరిగినట్టుగా ఎందుకు వరసగా గుర్తొస్తున్నాయి? వెనక చేరి తరుముతున్నాయి? ఏమయింది ఈ మధ్య నాకు?" అనుకోసాగాడు ఆనంద్.

"ఒకటా? రెండా? ఎన్ని విషయాలు? ఎన్ని సందర్భాలు? ఎప్పుడూ తనకోసమని ఏమీ ఉంచుకోలేదే? తన సుఖం చూసుకోలేదే? జీవితంలో ఎన్నో, చిన్న పెద్ద విషయాల్లో తన సుఖం కంటే నా సుఖమే ఎక్కువనుకుంతూ, నేను నవ్వితే తను నవ్వుతూ, నేనేడిస్తే నా కన్నీరు తుడుస్తూ, నేను కింద పడకుండా కొమ్ము కాస్తూ, నా ఆశలే తన ఆశయాలుగా మలుస్తూ నాకోసమే, నా ఆనందం కోసమే జీవిస్తున్న నాన్న ఎప్పుడూ నెత్తిమీదే పెట్టుకున్నారన్న విషయం ఇప్పటివరకూ గుర్తురాలేదెందుకు?" ఇదే ఆలోచన అతని మనసును తట్టసాగింది.

నాన్న చెప్పిన సూచనల ప్రకారం నడుచుకుంటూ నా ఇరవైలనీ, ముప్ఫైలనీ సంతోషంగా గడిపిన నేను 'లైఫ్ బిగిన్స్ ఎట్ ఫార్టీ, వేర్ ఆర్ యూ?" అని పిలుస్తూ ఉంటే 'ఇంక గర్జించే నలభైల్తో సాఫీగా సాగడమే అనుకోలేకపోతున్నానెందుకు?

" పైగా తండ్రీ కొడుకుల గురించి ఏ చిన్న విషయం విన్నా, అది జోకే గానీ, పాటే గానీ, కథే గానీ ఏదైనా సరే, నాలో ఎందుకింత స్పందన కలుగుతోంది? ఇదీ చెప్పలేని భావన నా మనసునెందుకు తడుతోంది? తడి నా కంటిపాపనెందుకు తడుముతోంది?" ఆనంద్ మనసు ఆక్రోశించింది.

"నాన్న తనని భుజాల మీద మోసినప్పుడా భుజం నొప్పెడుతుందేమో? అన్న విషయం కూడా తెలియని వయసు, సైకిల్ మీద నుంచే కాదు ఎక్కడనించి పడిపోయినా నాన్న తన భుజం ఆసరాగా ఇచ్చి కాపాడతాడని తెలిసిన వయసు, ఇలా పెరిగింది తన వయసు.

అలా నాకు పెరిగిన వయసుతో, నాన్నగా కాక నిజంగానే నాన్నకీ వయసు పెరిగింది కదా! మరి తనెందుకు అది గమనించలేదు? ఇది ఇలా చేస్తే నువ్వు బావుంటావు, నీ కుటుంబం సుఖం గా ఉంటుంది అని నాన్న అంటూ ఉంటే నిజమే కదా అని కొన్ని ఆయన చెప్పినట్టూ, కొన్ని తనకు నచ్చినట్టూ చేసుకుంటూ పోయాడే కానీ, ఏ రోజైనా నాన్న సుఖం గా ఉండాలంటే ఏం చెయ్యాలి? అని ఆలోచన రాలేదెందుకు? ఎందుకు? "

ఎప్పుడెప్పుడు వెళ్ళి నాన్నని చూస్తానా? అని, నాన్న సమక్షంలో వీలైనంత ఎక్కువ కాలం గడపాలనీ, ఇన్నిరోజులు నన్ను వదిలి ఎలా ఉండగలిగారు నాన్నా? అని అడగాలని ఎందుకింతగా అనిపిస్తోంది? తన ఇరవైల్లో ఎంతో సిల్లీగా అనిపించిన నాన్న చెప్పిన కొన్ని విషయాలు ఇప్పుడు ఎంతో అర్థవంతంగా అనిపిస్తున్నాయెందుకు? ఎందుకు?

నీ పేరులోనే కాదు, మనసులోనూ, జీవితంలోనూ కూడా ఎప్పుడూ ఆనందమే నిండి ఉండాలి అని తపించే నాన్న తననిలా చూస్తే ఏమంటారో? ఈ మధ్యన ప్రతీ చిన్న విషయానికీ ఇంతగా స్పందిస్తున్న తనని చూసి నవ్వుతారా? ఇలా ప్రతీ విషయమూ నాన్న దగ్గరే మొదలయి ఆ చుట్టూనే తిరుగుతోందెందుకు?"

"గర్జించే నలభైలు.. ఎందుకిలా బావురుమంటున్నాయ్? బేర్ మంటున్నాయ్? ఉన్న ఊరునీ, కన్న తండ్రినీ 'కేరేపిన్' అనుకుంటూ కేరింతలు కొడుతూ వచ్చేసినందుకే తనని ఇలా కేర్ మని ఏడిపిస్తున్నాయా? ఎందుకు? మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలతోనే కంట్లో సుళ్ళు తిరిగిన నీళ్ళు.. బాధగా మూసుకున్న అతని కళ్ళవెంబడి కారుతున్న కన్నీళ్ళు. తుడుచుకునే ప్రయత్నం చెయ్యలేదు, హాయిగా మనస్ఫూర్తిగా ఏడవసాగాడు.

" ఈజ్ ఎవిరీథింగ్ ఓకె సర్?" ఎయిర్ హోస్టెస్ అడుగుతున్న మాటలకి ఒక్కసారిగా ఈ లోకంలో కి వచ్చాడు ఆనంద్.

" యా, ఐ. యాం ఫైన్. కెన్ ఐ గెట్ సంథింగ్ టు డ్రింక్ ప్లీజ్!" అని కళ్ళు తుడుచుకుంటూ సినిమా ఆపేశాడు.

అప్పుడు దొరికిందతని సమాధానం.

స్క్రీన్ మీద నవ్వుతూ తనకిష్టమైన కార్ బొమ్మతో నిల్చున్న కొడుకు సత్య ( నాన్న పేరే, సత్యానంద్) రూపంలో. పన్నెండేళ్ళ వాడికి.

"కొన్నాళ్ళు బోర్డింగ్ స్కూల్లో ఉంచుదాం! "అంది జనని.

"ఎనిమిది నించీ, పన్నెండు దాకా ఇక్కడ చదివితే మంచి ఫౌండేషన్ ఉంటుంది,పై చదువులకి బాగా ఉపయోగపడుతుందని ఆమె ఉద్దేశ్యం. రెండు నెలలక్రితం తొలిసారిగా చెప్పింది తన ఆలోచన.

"ఇప్పుడు వాడు ఇంకా ఏడోక్లాసే కదా, ఈ వేసవి సెలవుల్లో వెళ్ళి మంచి స్కూళ్ళు చూసి అన్ని రకాలుగా బావున్నది ఎంచుకోవచ్చు " అని ఆమె ఆలోచన. అంతే కాదు అలా అయిన కొంత తమ దేశం గురించి వాడికి తెలుస్తుంది "అంది. మొదట్లో బాగానే అనిపించింది తనకి కూడా, కానీ గత నెలా పదిహేనురోజులనించీ తనకి ఆ విషయమే నచ్చడం లేదు.

పుట్టిన రోజే " నువ్వు నా నాన్నవని కనుక్కున్నాలే" అన్నట్టుగా నవ్వినవాడు,

చిన్న నోటితో తన బుగ్గలని తడి చేసిన వాడు,

తన గుండెల మీద ఆడిన వాడు,

తను కనపడకపోతే అన్నం తినని పసివాడు..

చక్కని ఆ నుదిటిపై అల్లరిగా ఆడుతున్న ముంగురులతో చిన్నారి చందమామలా అమాయకంగా ఉన్నవాడు, తన కొడుకు. వీడిని వదిలి ఉండగలడా?".

తన పక్కన సీట్లో పడుకున్న సత్య చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అప్రయత్నంగానే చెంపకి ఆనించుకుని ఉండిపోయాడు. జనని గాఢ నిద్రలో ఉంది మూడో సీట్లో.

" లేస్తే, తననిలా చూస్తే నవ్వుతుందేమో? నవ్వనీ, పరవాలేదు. ఒక్క నాన్నకి తప్ప ఈ భావన ఎవరికీ అర్ధం కాదు."

" తను భుజాల మీద మోసిన కొడుకు తన భుజాన్ని దాటి నిలబడాలని ఆరాట పడుతూ ఉంటే ఆ తండ్రి పొందే ఆనందం అమ్మలకేం తెలుస్తుంది? "

"నీకు తెలియదు నాన్నా, ఇది ఇలా చెయ్యాలి అని ఎద్దేవా చేసినా సరే ముచ్చటగానే ఉంటుందనే సత్యం నాన్నలకి కాక ఎవరికి తెలుసు?"

" నువ్వుండు నాన్నా, నేను పెడతాలే అని చేతిలోంచి బరువు పనులందుకుంటూ ఉంటే ఎంత బావుంటుందో?" అనుకుంటూ ఉండగా అతనికి స్ఫురించింది తన వేదనకి, ఆలోచనలకీ సమాధానం.. చాలా తేలికైన సమాధానం.

కొడుకులకి తట్టని, తండ్రులకి మాత్రమే అనుభవమయ్యే సమాధానం. ఇన్నాళ్ళు తను కేవలం కొడుకు, ఇప్పుడు నాన్న.

" భూమి గుండ్రంగా ఉంటుందంట, అమెరికా సరిగ్గా మనముండే చోటుకు అవతలపక్కనుందంట. అంటే వాడి నెత్తిమీద మనమూ, మన నెత్తి మీద వాడు" సినిమాలోని డైలాగు గుర్తొచ్చింది.

"అవును భూమి నిజంగానే గుండ్రంగానే ఉంది, అన్నీ చక్రభ్రమణాలే, జీవితమే ఒక రంగుల రాట్నం."

తనని కంటికి రెప్పలా సాకి, విద్యా బుద్ధులు నేర్పి పెద్దవాడిని చేసిన ఇరవైలు, ముప్పైలు కూడా తనను కొడుకుగానే ఉంచాయి. ఇప్పుడు తన కొడుకును వదిలి ఉండాలన్న ఊహే ఈ గర్జించే నలభైలు బావురుమనడానికి కారణం.

ఇప్పుడు కదా తనకి అర్ధం అయింది పైకి గంభీరంగా ఉండి తనను పంపినప్పుడు నాన్న పడిన బాధ. శోకంలో శ్లోకం పలికిందిట వాల్మీకికి. తనకీ అంతే, శ్లొకం కాకపోయినా చిన్న చిరుదీపం వెలిగింది. సత్యని బోర్డింగ్ స్కూల్లో ఉంచడం కాదు తాము చెయ్యవలసింది. నాన్నని ఎలాగైనా ఒప్పించి తమతో ఉండేలా చెయ్యడం, అది ఈ భూగోళంలో ఎక్కడైనా సరే తను రెడీ. జీవితంలో ఆనందం ముఖ్యం తనకి, గ్లోబు చేతిలోకో, జేబులోకో రావడం కాదు.

" నాన్న చెప్పే సమాధానం తనకి తెలుసు. మీ మహానగరాల్లో నేనిమడలేనురా! ఈ భోగళశాస్త్రం చెప్పే మాస్టారు ఈ భూమి మీద తీరిపోవలసిందే అంటారు. ఈ సారి మాత్రం ససేమీరా అనాల్సిందే."

" బయట వాతావరణం సరిగా లేనందున సీటు బెల్టులు పెట్టుకోవలసిందిగా కోరుతున్నాము" అన్న ప్రకటనతో నే మెరుపులు మెరిసి, మేఘాలతో నిండిన ఆకాశం అతన్ని చూసి నవ్వింది. నలభై రెండేళ్ళ ఆనంద్ మనసులో తండ్రీ, కొడుకూ కూడా చిరునవ్వు నవ్వుతున్నారు. సీట్ బెల్ట్ పెట్టుకుంటూ చిరునవ్వు నవ్వాడు. జ్యూస్ గ్లాస్ తో వచ్చిన హోస్టెస్ కూడా చిరునవ్వు నవ్వింది.●●●